సాక్షి
అనకాపల్లి

శుక్రవారం । 3 । మే । 2024



కూటికుప్పలకు అవార్డు

విశాఖ: డాక్టర్ కూటికుప్పల సూర్యారావు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు నుంచి దాసరి ఫిల్మ్ అవార్డు అందుకున్నారు.



పంచామృతాభిషేకం

విశాఖ: కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
37.5/27.5

వాతావరణం

మోస్తరు వర్షం లేదా జల్లులు కురిసే అవకాశముంది. ఈదురు గాలులు గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త గౌరి తెలిపారు.

పండుటాకులు విలవిల



పింఛన్ కోసం వెళితే వడదెబ్బ

నక్కపల్లి మండలం ఒడ్డిమెట్టకు చెందిన చిటికెల దేవుడమ్మ పింఛన్ కోసం దేవవరంలో ఉన్న సచివాలయానికి వెళ్తూ మార్గంమధ్యలో జాతీయరహదారిపై వడదెబ్బ తగిలి కుప్పకూలింది. కుటుంబ సభ్యులు చూసి వెంటనే ఆమెను పాయకరావుపేట ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి ఇంటికి తీసుకెళ్లి సపర్యలు చేస్తున్నారు. 'పింఛన్ కోసం వెళ్తే ప్రాణాల మీదకు వచ్చింది నాయనా, ఈ మాయదారి చంద్రబాబు మా పేణాలు తోడెత్తున్నాడు. ఎంచక్కా కాళ్ల దగ్గరకి తెచ్చిచ్చే పింఛన్ ఆపేసాడంట. అతనికి ఏ మొచ్చిందో మాలాంటి ముసలోళ్ల ఉసురు పోసుకుంటున్నాడం'టూ కన్నీళ్లపర్యంతమయింది.



వృద్ధురాలికి ఎంత కష్టం!

ఈ ఫొటోలో ఉన్న నక్కపల్లికి చెందిన వృద్ధురాలి పేరు సింగంశెట్టి కాంతమ్మ. సరిగ్గా నడవలేదు. ఆమె పెన్షన్ బ్యాంకు ఖాతాలో జమ చేశారు. అకౌంట్ బుక్ కనిపించడం లేదు అంటోంది. నాలుగేళ్లుగా వలంటీర్ ఇంటికి తెచ్చి పెన్షన్ ఇవ్వడం వల్ల పుస్తకం పనిలేదు. ఇపుడు బ్యాంకుకి వెళ్తే పాస్‌బుక్ కావాలి అంటున్నారు. ఏమి చేయాలో తోచడం లేదని బాధపడుతోంది. మూడు చక్రాల రిక్షాపై బ్యాంకుకు వచ్చి నిరాశగా వెనుదిరిగింది.

- పింఛను పొందేందుకు బ్యాంకుల వద్ద పడిగాపులు
- మండుటెండలో సమస్యలు ఎదుర్కొన్న వృద్ధులు, వితంతువులు
- మే నెలలోనూ తప్పని పెన్షన్ కష్టాలు
- చంద్రబాబుపై నిప్పులు చెరుగుతున్న పింఛనుదార్లు



నక్కపల్లి ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు వద్ద పింఛన్ కోసం క్యూలో పడిగాపులు పడుతున్న లబ్ధిదారులు



దేవరాపల్లిలో పింఛన్‌దార్లతో కిక్కిరిసిన ఎస్‌బీఐ బీసీ పాయింట్

నక్కపల్లి: అవ్వా తాతలపై చంద్రబాబునాయుడి కక్ష సాధింపు చర్యలు మే నెలలో కూడా కొనసాగాయి. ఏప్రిల్ నెలలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్ ఇవ్వకుండా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి అడ్డుకున్న చంద్రబాబు అండ్ కో మే నెలలో కూడా ఇదే కుట్రపూరిత ధోరణి కొనసాగించారు. చంద్రబాబు, మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్‌కు మార్క్‌ల ఫిర్యాదుతో ఎన్నికల సంఘం పింఛన్ సొమ్ము వలంటీర్ల ద్వారా పంపిణీ చేయరాదంటూ ఆదేశాలు జారీ చేసిని విషయం తెలిసిందే. దీంతో గత నెల లబ్ధిదారులు సచివాలయాల వద్ద పడిగాపులు కాచి పింఛన్ సొమ్ము తీసుకోడానికి అష్టకష్టాలు పడ్డారు. వారి ఇబ్బందులను గుర్తించిన ఎన్నికల సంఘం లబ్ధిదారుల ఇళ్లకు సచివాలయ సిబ్బందిని పంపించి పింఛన్ బట్వాడా చేయించింది. అయినా అవ్వా తాతలపై చంద్రబాబు కడుపు మంట చల్లారలేదు. మే నెల పింఛన్ నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని నిమ్మగడ్డ రమేష్‌తో మరో పిటిషన్ వేయించారు. దీంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం మే నెల పింఛన్ సొమ్ము లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. నూటికి 80 శాతం లబ్ధిదారుల పింఛన్ సొమ్ము బ్యాంకుల్లో జమ అయింది. మంచాన పడ్డవారు, బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాని వారి పింఛన్లను మాత్రం నేరుగా సచివాలయ సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి అందిస్తున్నారు.

అనకాపల్లి జిల్లాలో 24 మండలాలు, 2 మున్సిపాలిటీల్లో అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, డప్పు కళాకారులు ఇలా మొత్తం 2,65,210 మంది పింఛన్ లబ్ధిదారులున్నారు. వీరిలో బ్యాంకు ఖాతాలు సక్రమంగా ఉన్న 1,97,790 మందికి నేరుగా అమరావతి నుంచే పింఛన్ జమ చేస్తున్నారు. బ్యాంకు ఖాతాలు సక్రమంగా లేనివారు, మంచానికే పరిమితమైనవారు, సచివాలయాలకు వచ్చి పింఛన్ తీసుకోలేని దివ్యాంగుల్లో 67,420 మందికి కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది ద్వారా సొమ్ము అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే బ్యాంకులో జమ అయిన పింఛన్ సొమ్మును తెచ్చుకునేందుకు లబ్ధిదారులు నానా యాతన పడుతున్నారు. ఒకటో తేదీ మేడే కావడంతో బ్యాంకులకు సెలవు. దీంతో గురువారం లబ్ధిదారులంతా బ్యాంకులకు క్యూకట్టారు. విపరీతమైన రద్దీతో అక్కడ గంటల తరబడి వేచి ఉన్నారు. మండుటెండలో పింఛన్ సొమ్ము కోసం పండుటాకులు విలవిల్లాడారు.

చంద్రబాబు నిర్వాకంతోనే..



నాకు 80 సంవత్సరాలు. వయో భారం కారణంగా ఇంటి వద్దే ఉంటున్నాను. ఈ ఎండల్లో బయటకు కూడా రాలేకపోతున్నాను. ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీరు ఇంటికి తెచ్చి పింఛన్ ఇచ్చేవోడు. చంద్రబాబు నిర్వాకం వల్ల కిందటి నెల పింఛన్ సచివాలయానికి వెళ్లి తెచ్చుకున్నాను. ఈ నెల బ్యాంకులో వేశామని చెప్పేరు. తీసుకోడానికి వచ్చేను. బ్యాంకు రద్దీగా ఉంది. ఎండలో రెండు గంటలు నిలబడి తీసుకోవాల్సి వచ్చింది. నరకం అనుభవించాను.

–గంపల లచ్చన్న, పాయకరావుపేట


8 కి.మీ. దూరం నుంచి వచ్చా



ఆటోకు రూ.60 ఇచ్చి 8 కి.మీ. దూరంలో ఉన్న దేవరాపల్లికి పింఛన్ సొమ్ము కోసం వచ్చాను. ఎక్కువ మంది పింఛన్‌దార్లు రావడంతో మండుటెండలో గంటల తరబడి నిలబడలేక నరకయాతన అనుభవించాను. ప్రతి నెలా వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ అందజేసేవారు. వారిని అడ్డుకొని మాలాంటి ముసలివాళ్లను ఇబ్బందులకు గురి చేయడం అత్యంత దారుణం. ఇంత ఎండలో ఇంటికి ఎలా చేరుకోవాలో ఆందోళనగా ఉంది.

– జడ్డేటి దేముడమ్మ, తామరబ్బ, దేవరాపల్లి మండలం

మామీద ఎందుకీ కక్ష?



నాకు రెండు కాళ్లు పనిచేయవు. పెతీ నెలా ఒకటో తేదీనే వలంటీరు ఇంటికి తెచ్చి పింఛన్ ఇచ్చేవోడు. చంద్రబాబు వద్దన్నాడని ముందు నెల ఆపేశారు. సెక్రటరీ తెచ్చి ఇచ్చేడు. ఈ నెల కూడా అలాగే ఇత్తారనుకున్నాను. మా పింఛన్ డబ్బులు బ్యాంకులో ఏసేశారని సెప్తన్నారు. నేను ఎలా ఎల్లగలను. ఆటో కట్టించుకు ఎల్తే రెండొందలు అవుద్ది. ఇదెక్కడి న్యాయం? మాలాంటోళ్లను ఇబ్బంది పెట్టడం ఇదేం ధర్మం?

–కోడ నల్లయ్య, కొత్త పోలవరం

రెండు రోజుల్లో 95 శాతం పూర్తి

- జిల్లాలో 2.5 లక్షల మందికి రూ.73.28 కోట్లు పంపిణీ

తుమ్మపాల: జిల్లాలో సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ రెండు రోజుల్లో 95 శాతం వరకు పూర్తయిందని డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి తెలిపారు. ప్రభుత్వం ఆదేశాలతో వృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలికంగా ఆరోగ్యసమస్యలతో మంచాన ఉన్నవారికి సచివాలయ సిబ్బంది నేరుగా ఇంటికి వెళ్లి నగదును 90.87 శాతం మందికి పింఛన్లు అందించారన్నారు. జిల్లాలో 67,420 మందికి ఇంటింటికీ అందించాల్సి ఉండగా గురువారం నాటికి 61,267మందికి అందించామని, ఇక డీబీటీ ద్వారా బ్యాంకుల్లో 1,97,790 మందికి నగదు జమ చేయాల్సి ఉండగా రెండో రోజుకు 1,89,723 మందికి నగదు జమ అయ్యిందన్నారు. మొత్తం 95.92 శాతం పంపిణీ పూర్తయిందని ఆమె తెలిపారు. జిల్లాలో మొత్తం 2,65,210 మందిలో మొదటి రెండు రోజుల్లో 2,51,549 మందికి రూ.73,28, 83,500 పంపిణీ పూర్తయిందన్నారు.

మనిషి బీజేపీ.. మనసు టీడీపీ

- సీఎం రమేష్‌ను ప్రజలే కాదు పార్టీ కార్యకర్తలూ నమ్మడం లేదు
- అక్రమాస్తులను కాపాడుకునేందుకే బాబు సలహాతో బీజేపీలో చేరారు
- అనకాపల్లిలో ఆ వలస నేతకు పరాభవం తప్పదు
- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న బూడి ముత్యాలనాయుడు, పక్కన నర్సీపట్నం అభ్యర్థి గణేష్

నర్సీపట్నం: సీఎం రమేష్‌ను జిల్లా ప్రజలు ఎలాగూ నమ్మరని.. మనిషి బీజేపీ, మనసు టీడీపీ కావడంతో ఇరు పార్టీల కార్యకర్తలు సైతం ఆయనను విశ్వసించడం లేదని డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్‌తో కలిసి గురువారం క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రమేష్‌లా తాను బ్యాంకులను మోసం చేయలేదన్నారు. దోపిడీలు చేయటం తనకు చేతకాదన్నారు. అక్రమ ఆస్తులను కాపాడుకునేందుకు చంద్రబాబు అనుమతితో ఆయన బీజేపీలో చేరారని, రెండు పర్యాయాలు రాజ్యసభ సభ్యుడిగా పనిచేసినా ఏనాడూ స్టీల్‌ప్లాంట్ గురించి నోరు మెదపలేదన్నారు. స్థానికులకే ఎంపీ టికెట్ కేటాయించాలని తొలుత గట్టిగా మాట్లాడిన అయ్యన్నపాత్రుడు డబ్బుల కోసం సీఎం రమేష్‌కు సాగిలపడ్డారని విమర్శించారు. ఇక్కడి ప్రజలు విజ్ఞత కలిగినవారని, స్థానికేతర్లకు ఇక్కడ ప్రజలు పట్టం కట్టిన దాఖలాలు లేవన్నారు. రాయలసీమ ప్రాంతం నుంచి డబ్బు సంచులతో దిగిన సీఎం రమేష్ ఓటర్లను కొనేయాలనుకుంటే.. ఆయన ఆటలు చెల్లవన్నారు. టీడీపీ నాయకులు అమ్ముడు పోతారేమో కాని ఓటర్లు మాత్రం డబ్బులకు లొంగిపోయే వారు కాదన్నారు.

ప్రజల కలలకు వాస్తవ రూపం

సీఎం రాష్ట్ర ప్రజల ప్రగతిని దృష్టిలో పెట్టుకొని మేనిఫెస్టోకు రూపకల్పన చేశారని, వారి కలలకు వాస్తవ రూపం ఇచ్చారని ముత్యాలనాయుడు అన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే రాష్ట్రం అప్పులు పాలవుతుందని గగ్గోలు పెట్టిన చంద్రబాబు.. అవే సంక్షేమ పథకాలను అమలు చేస్తానని సిగ్గు లేకుండా మేనిఫెస్టో విడుదల చేశారని విమర్శించారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో ఎలాగైనా అధికారం దక్కించుకోవాలని చంద్రబాబు చూస్తున్నారని వ్యాఖ్యానించారు. రైతన్నకు మంచి చేసే ఆలోచనతో జగనన్న ఉంటే, కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై చంద్రబాబు, అయ్యన్నపాత్రుడు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు రైతులకు ఉపయోగపడే ఏ పథకమైనా తీసుకోచ్చారా అని ప్రశ్నించారు. నేడు రైతు భరోసా, రైతులకు రుణాలు, కౌలు రైతుల చట్టం తదితర పథకాలను జగనన్న అమలు చేస్తుంటే ఓర్వలేని చంద్రబాబు అసత్యప్రచారం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రుత్తల యర్రాపాత్రుడు పాల్గొన్నారు.

నేటి నుంచి హోం ఓటింగ్

- 85 ఏళ్లు దాటిన, 40 శాతం వైకల్యం ఉన్న 1200 మందికి అర్హత
- 8వ తేదీ వరకు ఇళ్ల వద్దనే పోలింగ్
- ఈ నెల 6 నుంచి పోస్టల్ బ్యాలెట్

సాక్షి, అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచే విధంగా ఎన్నికల కమిషన్ 'ఓట్ ఫ్రం హోం'ను తీసుకొచ్చింది. 85 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు, 40 శాతం పైబడి వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఇంటికే వెళ్లి ఓటు వేయించే ప్రక్రియ ఇది. ఈ ఎన్నికల్లోనే ఈ విధానానికి శ్రీకారం చుడుతున్నారు. పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి ఎం.రోజారాణి పర్యవేక్షణలో జిల్లాలో హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్‌కు అర్హత ఉన్న 51 వేల మంది నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వీటిలో 13,200 ఆమోదం పొందాయి.

హోం ఓటింగ్..

ఇంటి వద్దనే ఓటు వేసేందుకు జిల్లాలో 25 వేల మందికి అప్లికేషన్లు ఇచ్చారు. వీరిలో 1200 మంది హోం ఓటింగ్ కోసం అర్హత సాధించారు. ఏడుగురు సభ్యులతో కూడిన బృందం పర్యవేక్షించింది. డీఎంహెచ్ఓ డాక్టర్ హేమంత్ ఆధ్వర్యంలో ఓటింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్..

ఎన్నికల విధుల్లో భాగస్వాములయ్యే అధికారులకు, సిబ్బందికి ఈ నెల 6, 7, 8 తేదీల్లో ఫెసిలిటేషన్ కేంద్రం ద్వారా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ఉంటుంది. జిల్లాలో మొత్తం 26 వేలమంది దరఖాస్తు చేసుకోగా.. 12 వేల మందిని అనుమతించారు.

హోమ్ ఓటింగ్‌కు ప్రత్యేక బృందాలు

తుమ్మపాల: ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హోమ్ ఓటింగ్ నిర్వహిస్తామని జిల్లా పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి ఎం.రోజారాణి తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి ఆదేశాల మేరకు జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో హోమ్ ఓటింగ్‌కు ప్రత్యేక బృందాలను నియమించి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఒక్కో బృందంలో ఒక ఏపీవో, ముగ్గురు ఓపీవోలు, ఒక పోలీస్, వీడియోగ్రాఫర్ ఉంటారన్నారు. ప్రతి నియోజకవర్గంలో 4 నుంచి 5 బృందాలను నియమించామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకు జరుగుతుందన్నారు. ప్రతి ఆర్వో కార్యాలయం వద్ద పోస్టల్ ఓటింగ్ కేంద్రాలు, ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి బూత్‌లో 1+3 సిబ్బంది ఉంటారని, అన్ని రకాల పోస్టల్ ఓటింగ్ ఈ నెల 8 నాటికి పూర్తి చేస్తామని ఆమె పేర్కొన్నారు.

వైభవంగా చక్రస్నానం



శ్రీవారికి చక్రస్నానం చేయిస్తున్న వేద పండితులు,జూపల్లి రామేశ్వరరావు,కుమారి దంపతులు

- మైహోం ఇండస్ట్రీస్‌లో ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

యలమంచిలి రూరల్: ములకలాపల్లి మైహోం ఇండస్ట్రీస్ సిమెంటు కర్మాగారంలో వ్యూహలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. వైభవోపేతంగా నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో చివరి అంకమైన చక్రస్నాన ఘట్టాన్ని వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ కనులపండువగా నిర్వహించారు. అంతకుముందు ఉదయం యాగశాలలో నిత్యారాధన,చతుస్థానార్చన,మూల మంత్ర జపానుష్టాన పారాయణ, మహాపూర్ణాహుతి, అష్టోత్తరశత కలశాభిషేకం జరిగాయి. చక్రస్నానం తర్వాత తీర్థప్రసాదగోష్టి, ఉత్సవ సమాప్తి నిర్వహించారు. రాత్రి 7 గంటలను శ్రీవారికి ఊంజల్ సేవ జరిపారు.ఈ సందర్భంగా భక్తుల గోవిందనామస్మరణతో వీధులన్నీ మార్మోగాయి. 30 మంది వేదపండితులు, విజయవాడ వేద పాఠశాల నుంచి త్రిదండి చినజీయర్ స్వామి శిష్య బృందం,ఆలయ ప్రధానార్చకులు వెంకటకృష్ణమాచార్యులు తదితరులు చక్రస్నాన క్రతువును శాస్త్రోక్తంగా పూర్తిచేశారు. కార్యక్రమంలో మైహోం గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వరరావు, కుమారి దంపతులు, ఫ్యాక్టరీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (వర్క్స్) వీహెచ్ చౌదరి,మైహోం డైరెక్టర్ (ఆపరేషన్స్) పి.ఎస్. పాండే,పలువురు ఉద్యోగులు,కార్మికులు,పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

బుచ్చెయ్యపేట: మండలంలోని బంగారుమెట్టకు చెందిన టీడీపీ నాయకులు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన మాజీ వార్డు మెంబర్ మేరుగు రాము, గ్రామ దళిత సంఘ నాయకుడు బండి గంగరాజు, వీర్ల నారాయణమూర్తి తదితరులు తమ కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి గురువారం విశాఖ నగరంలోని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. సీఎం జగనన్న, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ విజయానికి పాటుపడతామని పార్టీలో చేరిన నాయకులు తెలిపారు. మాజీ సర్పంచ్ శిరిగిరిశెట్టి నానాజీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'బూటకపు హామీల చంద్రబాబుకు బుద్ధి చెప్పండి' 8లో

3 హైస్కూళ్లు కాలేజీలుగా అప్‌గ్రేడ్



నాతవరం హైస్కూల్లో పోస్టర్ విడుదల చేసి ర్యాలీని ప్రారంభిస్తున్న హెచ్ఎం శాంతికుమారి



కాలేజీలో చేరాలని విద్యార్థులకు కరపత్రాలు పంచిపెడుతున్న ఉపాధ్యాయులు

- ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీలకు 40 సీట్లు వంతున మంజూరు
- వచ్చే నెల 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం

నాతవరం: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో మూడు జెడ్పీ హైస్కూళ్లను జూనియర్ కళాశాలుగా అప్‌గ్రేడ్ చేసింది. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ, ఎంపీసీ గ్రూపులకు 40 సీట్లు వంతున మంజూరు చేసింది. నాతవరం, అచ్యుతాపురం, ఎస్.రాయవరంలో స్థాయి పెరిగిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా వ్యవహరిస్తున్నారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తామని హెచ్ఎం శాంతికుమారి తెలిపారు. గురువారం నాతవరంలో ఉపాధ్యాయులు పోస్టర్ విడుదల చేశారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నాతవరంలో పదో తరగతి పాసైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులకు వివరించారు. ఇంటర్ చదువుకు పట్టణ ప్రాంతాలకు వెళ్లకుండా నాతవరంలోనే చదువు కోవచ్చన్నారు. ప్రస్తుతం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, కాలేజీలో చేరాలన్నారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. కాలేజీ మంజూరైన విషయాన్ని మండల వ్యాప్తంగా ప్రచారం చేశామని హెచ్ఎం తెలిపారు.

సంస్కృత భాష కంప్యూటరీకరణతో మేలు

విశాఖ: సంస్కృత భాష వ్యాప్తికి కంప్యూటరీకరణ ప్రముఖ పాత్ర పోషిస్తుందని ఆచార్య కోలవెన్ను మలయవాసిని అన్నారు. జిల్లెళ్లమూడి సంస్కృతి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గురువారం అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో 'సంస్కృత భాష–కంప్యూటరీకరణ' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య వక్తగా ప్రసంగించారు. అగర్తల ట్రిపుల్ ఐటీ పూర్వ డైరెక్టర్ పి.ఎస్.అవధాని మాట్లాడుతూ సంస్కృత భాష కంప్యూటరీకరణ పూర్వాపరాలను విపులంగా విశదీకరించారు.

బి.గోపి మాట్లాడుతూ సంస్కృత భాష కోసం తాము రూపొందించిన కంప్యూటర్ గురించి విషయాలు సభికులకు వివరించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు, కె.వి.ఎస్.రాజేశ్వరరావు, జి.జానకీరామ్‌లు సంస్కృత బాష కంప్యూటరీకరణలోని పలు అంశాలపై చర్చించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ చిలకలూరి శాంతమ్మ, మల్లాది భాస్కరం, గాదిరాజు జానకీరామ్, ఘండికోట విశ్వనాథం పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ప్రైవేటు పాఠశాలలో ఉచిత సీట్లకు 1133 మంది అర్హత

అనకాపల్లి : జిల్లాలో ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి మొదటి విడతగా 1,133 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాహక్కుచట్టం ప్రకారం లాటరీలో ఈ ఎంపిక జరిగిందన్నారు. నిబంధనల ప్రకారం ఎంపిక చేసిన విద్యార్థులకు 3 కిలోమీటర్ల పరిధిలోని పాఠశాలలను గుర్తించి, సీట్లు కేటాయించారని, ఎంపికైన చిన్నారుల తల్లిదండ్రులు, సంరక్షకుల మొబైల్ నంబర్లకు సమాచారం పంపించినట్లు ఆమె తెలిపారు. మండల విద్యాశాఖాధికారులకు ఈ సమాచారం పంపించామని, ఎంపికైన విద్యార్థులు ఈనెల 10వ తేదీలోపు సంబంధిత ప్రైవేట్ పాఠశాలల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందన్నారు. 100 శాతం అడ్మిషన్లు పూర్తి చేసే విధంగా ఎంఈవోలు చర్యలు చేపట్టాలని, ఒకటో జాబితాలో మిగిలిన సీట్లను మాత్రమే రెండో జాబితాలో ప్రకటించడం జరుగుతుందని ఆమె చెప్పారు.

టీడీపీ, జనసేన, బీజేపీ నేతల కోడ్ ఉల్లంఘన

మునగపాక: టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారు. కోడ్ అమలు నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో గాని, దేవాలయాల్లో గాని ప్రచారం నిర్వహించడం నిషేధం. ఇందుకు విరుద్ధంగా ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని చూచుకొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల–2లో గురువారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ విషయమై వైఎస్సార్‌సీపీ నేతలు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు.

నేటి నుంచి చందనోత్సవ టికెట్ల విక్రయాలు

ఆన్‌లైన్‌లో రూ. 1500 టికెట్లు



సింహాచలం: ఈ నెల 10న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి సంబంధించి దర్శన టికెట్ల విక్రయాలు శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభించనున్నట్టు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి వెల్లడించారు. ఈ నెల 7వతేదీ వరకు సాయంత్రం 5గంటల వరకు విక్రయాలు జరుగుతాయని పేర్కొన్నారు. సింహాచలం, మహారాణిపేట, అక్కయ్యపాలెంలోని యూనియన్ బ్యాంకు బ్రాంచ్‌లు, సింహాచలం, సాలిగ్రామపురం(అక్కయ్యపాలెం బ్రాంచ్), బిర్లా జంక్షన్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లతో పాటు సింహాచలం కొండపైన ఉన్న పీఆర్వో కార్యాలయంలో కూడా రూ.300, రూ.1000 టికెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ఆన్‌లైన్‌లో కూడా విక్రయాలు

ఈనెల 3వతేదీ సాయంత్రం 4 గంటల నుంచి 7వతేదీ సాయంత్రం 6గంటల వరకు రూ.300, రూ.1000 టికెట్లతో పాటు రూ.1500 టికెట్లు కూడా ఆన్‌లైన్‌లో లభ్యమవుతాయని ఈవో పేర్కొన్నారు. www.ap temples.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా టికెట్లు పొందవచ్చని తెలిపారు. 10వ తేదీన చందనోత్సవం రోజు ఎలాంటి దర్శనం టికెట్లు విక్రయాలు జరగవని స్పష్టం చేశారు. టికెట్లు లేని భక్తులు ఉచిత దర్శనం క్యూలో మాత్రమే దర్శనానికి వెళ్లాల్సి ఉంటుందని సూచించారు.

రేపటి నుంచి తొలివిడత చందనం అరగదీత



చందనం చెక్కలను ముక్కలుగా కోస్తున్న దేవస్థానం సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై శనివారం నుంచి తొలి విడత చందనం అరగదీత కార్యక్రమం నిర్వహించేందుకు దేవస్థానం వైదికులు, అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ నెల 10న చందనోత్సవం సందర్భంగా స్వామి వారి నిజరూప దర్శనం అనంతరం తొలివిడతగా సమర్పించే మూడు మణుగుల చందనాన్ని (సుమారు 125 కిలోల పచ్చిచందనం) సమకూర్చేందుకు అరగదీత కార్యక్రమం చేపట్టనున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 4న ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం తొలిచందనం చెక్కకు శాస్త్రోక్తంగా పూజలు చేసిన అనంతరం, నాల్గో తరగతి సిబ్బంది చందనాన్ని అరగదీస్తారు. ఈ మేరకు గురువారం ఆలయ బేడామండపంలో చందనం చెక్కలను ముక్కలుగా కోసి అరగదీతకు అనుగుణంగా సిద్ధం చేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో పాలూరి నరసింగరావు, సూపరింటెండెంట్ వెంకటరమణ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

రాష్ట్రానికి ఇవి కీలక ఎన్నికలు



రత్నంపేటలో ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, అసెంబ్లీ అభ్యర్థి ధర్మశ్రీ



బి.బి.పట్నంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజలు

- ప్రజలను మభ్యపెట్టే మేనిఫెస్టో చంద్రబాబుది
- ప్రజామోదం పొందే విధంగా జగనన్న మేనిఫెస్టో
- అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మశ్రీ

రోలుగుంట: రాష్ట్రానికి ఇవి కీలక ఎన్నికలని, రాష్ట్రంలో గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి,అమలు చేసిన సంక్షేమ పథకాలు, సుపరిపాలను గమనించి మళ్లీ వైఎస్సార్‌సీపీకి అవకాశం కల్పించాలని ఉప ముఖ్యమంత్రి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ కోరారు. మండలంలో ఎం.కె.పట్నం, బి.బి.పట్నం, రత్నంపేట, బుచ్చింపేట, గుర్రాలబయిల, రాజంపేట, శరభవరం,అర్ల,పాపంపేట, కొవ్వూరు, కె.నాయుడుపాలెం, అంట్లపాలెం, నిందుగొండ,ఎస్.కొత్తూరు, మునిపల్లి గ్రామాల్లో గురువారం వారు విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ప్రతి గ్రామంలో ప్రజలు హారతులిచ్చి ఘనంగా స్వాగతించారు.

ఈ సందర్భంగా బూడి ముత్యాలనాయుడు, కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మోసాలు, అమలుకాని హామీలను గుర్తుతెచ్చుకోవాలన్నారు. ప్రజలను మభ్యపెట్టే విధంగా టీడీపీ మేనిఫెస్టో విడుదల చేస్తే, ప్రజామోదం పొందేలా జగనన్న మేనిఫెస్టో రూపొందించారని చెప్పారు. పార్టీని నడిపించుకోలేక, నమ్ముకున్న కార్యకర్తలను పవన్‌కల్యాణ్ నట్టేట ముంచారని, పార్టీని టీడీపీ, బీజేపీలకు అప్పగించి, ఓటర్లను నయవంచన చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజారంజకంగా పాలన చేసిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. మాటకు కట్టుబడి రూ.32 లక్షలతో నియోజకవర్గంలో పలు రోడ్లు నిర్మించినట్టు చెప్పారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, తమను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బూడి ముత్యాలనాయుడు, ధర్మశ్రీ కోరారు. ఈ ప్రచారంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు గొర్లె వెంకటరామన్, మండల యువజన విభాగం అధ్యక్షుడు దోసపత్ని రాజు, పార్టీ నాయకులు పోతల లక్ష్మీ శ్రీనివాస్, ఉలబాల రాము, తమటపు సత్యంనాయుడు, మడ్డు అప్పలనాయుడు, తమటపు సత్యంనాయుడు, కర్రి రాము,శెట్టి సత్యనారాయణమూర్తి, మలసాల భాస్కరరావు, గరగా సత్యవతి యర్రంశెట్టి కాంతమ్మ, కన్నడ హీరో గొందు సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

బూటకపు హామీల చంద్రబాబుకు బుద్ధి చెప్పండి



పైడంపేటలో జరిగిన ప్రచార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ



గుల్లేపల్లిలో సీఎం జగన్ చిత్రానికి చేతులెత్తి దండం పెడుతున్న అవ్వలు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

కె.కోటపాడు : తప్పుడు హామీలతో మోసం చేసే చంద్రబాబును ఓడించేందుకు ప్రజలు సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. మాడుగుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుకు మద్దతుగా గురువారం రొంగలినాయుడుపాలెం, పైడంపేట, గుల్లేపల్లి గ్రామాల్లో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో వరుదు కల్యాణ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ అద్దం అబద్ధం చెప్పదు..చంద్రబాబు ఎప్పుడూ నిజం చెప్పడని దుమ్మెత్తి పోశారు. ప్రజలను తప్పుడు హామీలతో మోసం చేసే చంద్రబాబును నమ్మవద్దని ఆమె ప్రజలను కోరారు.

రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల ఆత్మగౌరవం పెంపొందించే విధంగా సీఎం జగన్ పాలనను అందిస్తే, చంద్రబాబు మాత్రం 2014 ఎన్నికల్లో తప్పుడు హామీలతో డ్వాక్రా మహిళలు, రైతుల రుణాలు మాఫీ చేయలేక వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడ్డారని అన్నారు. సీఎం జగన్ పాలనలో గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకే, వెల్‌నెస్, డిజిటల్ లైబ్రరీలను నిర్మాణం చేపట్టి గ్రామ స్వరాజ్యం సాకారం చేశారని, విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇచ్చి పేద కుటుంబాల్లో వెలుగులు నింపారని అన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా గ్రామాల్లోనే మెరుగైన స్పెషలిస్ట్ వైద్యం అందించిన ఘనత కూడా సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు.

అందుకే రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్నకే సీఎంగా పట్టం కట్టాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చే ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధలకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గుల్లేపల్లిలో జరిగిన ఎన్నికల ప్రచార వాహనంపై ఉన్న సీఎం జగన్ చిత్రపటానికి అవ్వలు వచ్చి నమస్కరించారు.

ఈ ఘటన పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, దేవరాపల్లి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూరె బాబూరావు, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, రొంగలి రమేష్, పైల పైడితల్లమ్మ, వేచలపు దొరబాబు, గొర్రుపోటు రామలక్ష్మి, యడ్ల వెంకటరావు, బండారు దేముళ్ళు, శ్రీకాంత్ శ్రీను పాల్గొన్నారు.

ప్రచార పర్వం



మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ అందర్నీ పకలరిస్తూ, యోగక్షేమాలు తెలుసుకుంటూ ప్రచారం చేస్తున్నారు. కె.కోటపాడు మండలం కొరువాడ జగన్నాథపురంలో దివ్యాంగుడిని పలకరించి, మాట్లాడారు. - కె.కోటపాటు



పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. నక్కపల్లి మండలంలో గురువారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించిన ఆయనకు మూలవర గ్రామంలో రామలక్ష్మి దంపతులు బుద్దుడి ఫొటోను బహూకరించారు. - నక్కపల్లి



నర్సీపట్నం మున్సిపాలిటీలోని వార్డుల్లో ఎమ్మెల్యే గణేష్ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. 25వ వార్డులో ప్రచారం నిర్వహించిన గణేష్‌కు గురువారం ఓ మహిళ విజయ తిలకం దిద్దారు. - నర్సీపట్నం



ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు వాడవాడలా ప్రచారం నిర్వహిస్తున్నారు. గురువారం అచ్యుతాపురం మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు - అచ్యుతాపురం

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి



ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న మునగపాక యాతపేట జనసేన కార్యకర్తలు



శేషుకు కండువా వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

మునగపాక: వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని చెప్పారు. స్థానిక యాతపేటకు చెందిన జనసేన కార్యకర్తలు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన ప్రజారంజకంగా సాగుతోందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాలని, తద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. పోలవరపు నాని, అనిల్,శివకృష్ణ, ఎల్లంకి మహేష్, ప్రసాద్,గండిబోయిన యశోదకృష్ణ, పోలవరపు దినేష్, పూర్ణ చంద్రరావు, రంగాల వరప్రసాద్,రంగాల సునీల్, చుక్కల నాయుడు,కాకర వెంకటరావు,ముంగళగిరి సిందు,కుమార్, నాయుడు,శివ తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో ఉన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ,జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము,బోడకుర్తి గణేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు,పార్టీ నేతలు పిల్లి అప్పారావు,బీలా శివగణేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తైపురం మాజీ సర్పంచ్ చేరిక..

బుచ్చెయ్యపేట: మండలంలోని తైపురం మాజీ సర్పంచ్ నక్కా శేషు తన కుటుంబ సభ్యులు, అనుచరులతో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ గురువారం పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీలు చేస్తున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితుడనై టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరినట్టు శేషు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తానన్నారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు,పార్టీ మండల అధ్యక్షుడు కె. అచ్చింనాయుడు,మండల ఇన్‌చార్జి గేదెల శేషు,సర్పంచ్ ముచ్చకర్ల శ్రీను పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో వ్యయ నియంత్రణ ప్రాజెక్టులు భేష్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో లీడర్‌షిప్ సపోర్ట్ అండ్ ఎంకరేజ్‌మెంట్ ప్రొఫెషనల్ యుటిలిటీ (పల్స్) విధానం ద్వారా చేపడుతున్న వ్యయ నియంత్రణ ప్రాజెక్టుల పనితీరు ప్రశంసనీయమని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ కొనియాడారు. స్టీల్ ప్లాంట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ విభాగం ఆధ్వర్యంలో ఎల్‌డీసీ విభాగంలో 'పల్స్'పై గురువారం నిర్వహించిన ఒకరోజు ఇంటరాక్షన్, శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని, సభ్యులతో ముచ్చటించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 55 మంది యువ ఇంజినీర్లు, వివిధ నిపుణులతో కూడిన 15 బృందాల సభ్యులు పాల్గొన్నారు. ఎల్‌ఎంఎంఏ విభాగంలో పల్స్ కింద చేపట్టిన కార్యక్రమం విజయవంతం అయింది. ప్రారంభ కార్యక్రమంలో డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే, స్వతంత్ర డైరెక్టర్లు ఎస్.కె. హీరాణి, ఘన శ్యామ్‌సింగ్‌తో పాటు సీజీఎంలు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై గుర్తు తెలియని యువకుల దాడి



యువకులు దాడిలో గాయపడిన ఆర్టీసీ డ్రైవర్

బుచ్చెయ్యపేట: అనకాపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై గుర్తు తెలియని యువకులు దాడి చేశారు. గురువారం సాయంత్రం అనకాపల్లి డిపో నుంచి ప్రయాణికులతో మాడుగులకు ఆర్టీసీ బస్సు బయలుదేరింది. మద్యంమత్తులో ఉన్న ముగ్గురు యువకులు విజయరామరాజుపేట తాచేరు వంతెన వద్ద ఆర్టీసీ బస్సు ముందు తమ బైక్ నిలిపారు. దీంతో డ్రైవర్ కేకే రావు బస్సు ఆపడంతో వాహనంలో లోపలికి ప్రవేశించి ఆయనపై దాడి చేశారు. అంతేకాకుండా మరో వ్యాన్ అద్దాలు కూడా పగలగొట్టి, డ్రైవర్‌పై దాడి చేశారు. ఈ సంఘటన అనంతరం ఆర్టీసీ బస్సు సిబ్బంది ప్రయాణికులను వేరే బస్సులో గమ్యస్థానాలకు చేర్చారు. ఆర్టీసీ డ్రైవర్ బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

2600 లీటర్ల సారా పులుపు ధ్వంసం



స్వాధీనం చేసుకున్న డమ్ములతో ఎస్ఈబీ అధికారులు

పాయకరావుపేట: రెండు ప్రాంతాల్లో దాడులు చేసిన 2,600 లీటర్ల సారా పులుపు ధ్వంసం చేసినట్టు ఎస్ఈబీ సీఐ ఎస్.ధర్మారావు తెలిపారు. మండలంలోని పాల్తేరు శివారు చెరువు వద్ద దాడులు నిర్వహించి 1,000 లీటర్లు, కాకినాడ జిల్లా తొండంగి మండలం యల్లయ్యపేట సమీపంలో సముద్రతీర ప్రాంతం వద్ద 1,600 లీటర్ల సారా పులుపును ధ్వంసం చేసినట్టు తెలిపారు. కాకినాడ జిల్లా ఎస్ఈబీ సిబ్బంది, పాయకరావుపేట ఎస్ఈబీ ఎస్ఐ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నట్టు సీఐ చెప్పారు.

కుటుంబ గొడవలతోనే తాపీమేస్త్రి హత్య



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అప్పలనాయుడు

బుచ్చెయ్యపేట: ఇరు కుటుంబాల మధ్య గొడవలతోనే బుధవారం బుచ్చెయ్యపేటలో తాపీమేస్త్రి హత్యకు గురయ్యాడని కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. గురువారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ఐ డి. ఈశ్వరరావుతో కలిసి సీఐ వివరాలు వెల్లడించారు. హతుడు తాటికొండ అచ్చింనాయుడు, నిందితుడు గంట్రెడ్డి శ్రీను కుటుంబాల మధ్య తగాదాలు ఉన్నాయన్నారు. దీంతో వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడం, ఒకరికొకరు తిట్టుకోవడంతో శ్రీను అవమానంతో అచ్చింనాయుడుపై కత్తితో దాడి చేశాడని తెలిపారు. రాజాం జంక్షన్ వద్ద నిందితుడిని అరెస్టు చేసి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

ఎస్ఐపై దాడి కేసులో నలుగురికి రిమాండ్

యలమంచిలి రూరల్: పట్టణ ఎస్ఐపై దాడి చేసిన కేసులో నలుగురు నిందితులకు 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్టు యలమంచిలి సీఐ షేక్ గఫూర్ గురువారం తెలిపారు. గత మంగళవారం రాత్రి యలమంచిలి పట్టణానికి సమీపంలో అచ్యుతాపురం బైపాస్ రోడ్డుపై రెండు కార్లు ఢీకొన్న సమయంలో రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది. వివాదం కారణంగా నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు అక్కడికి వెళ్లిన పట్టణ ఎస్ఐ పాపినాయుడుపై రాంబిల్లి మండలం లాలంకోడూరుకు చెందిన నలుగురు యువకులు దాడి చేశారు. ఎస్ఐ పాపినాయుడు ఫిర్యాదు మేరకు లాలం మోహన్,రుత్తల గంగరాజు,లాలం చిరంజీవి అలియాస్ బాబ్జి,లాలం సందీప్‌లపై కేసు నమోదు చేసి, గురువారం స్థానిక ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరిచినట్టు సీఐ తెలిపారు. వారికి న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారని చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

భువనేశ్వర్–ఎల్‌టీటీ మధ్య సమ్మర్ స్పెషల్స్

తాటిచెట్లపాలెం: వేసవి సీజన్‌లో ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి ఈస్ట్ కోస్ట్ రైల్వే పలు ప్రత్యేక రైళ్లు నడిపేందుకు సిద్ధమైందని వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సమ్మర్ స్పెషల్ రైళ్ల వివరాలిలా..

- భువనేశ్వర్–లోకమాన్య తిలక్ టెర్మినస్(ఎల్‌టీటీ)(08420) రైలు ప్రతి బుధవారం రాత్రి 11 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు 6.45కు దువ్వాడ చేరుకుని, తిరిగి 6.50కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు లోకమాన్య తిలక్ టెర్మినస్‌కు చేరుకుంటుంది. ఈ రైలు జూన్ 26 వరకు నడుస్తుంది.
- తిరుగు ప్రయాణంలో లోకమాన్య తిలక్ టెర్మినస్–భువనేశ్వర్ (08419) రైలు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు లోకమాన్య తిలక్ టెర్మినస్‌లో బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 5.45లకు దువ్వాడ చేరుకుని, తిరిగి 5.50కు బయలుదేరి అదే రోజు మధ్యరాత్రి(ఆదివారం తెల్లవారు) 1.45 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. ఈ రైలు జూన్ 28 వరకు నడుస్తుంది.

విశాఖ–హతియా స్పెషల్ రైళ్ల రద్దు

విశాఖపట్నం–హతియా– విశాఖపట్నం (08559/08560) మధ్య నడుస్తున్న వీక్లీ సమ్మర్ స్పెషల్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైళ్లను ఇటీవలే వేశారు. జూన్ నెలాఖరు వరకు రాకపోకలు సాగించాలి. ఈ రైలుకు సరైన ఆక్యుపెన్సీ, డిమాండ్ లేనందున రద్దు చేస్తున్నట్లు తెలిసింది. వాస్తవానికి ఈ రైలుకు సరైన సమయంలో వేస్తే డిమాండ్ ఉంటుంది. అనువు కాని వేళల్లో ఈ ట్రైన్ నడుస్తున్నందున ఖాళీగా రాకపోకలు సాగించింది. బొకారో, టాటా ఎక్స్‌ప్రెస్‌ల వేళలకు కొంచెం అటూ ఇటుగా ఈ రైలు విశాఖ నుంచి బయలుదేరేలా చేస్తే డిమాండ్ ఉంటుందని పలువురు రైల్ యూజర్లు కోరుతున్నారు.

వృద్ధురాలిపై లైంగికదాడి ?

- జీడితోటలో అనుమానాస్పద స్థితిలో మృతి
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

గొలుగొండ: మండలంలోని రామచంద్రపురం సమీపంలో ఉన్న జీడిమామిడి తోటలో ఓ వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. గ్రామానికి చెందిన అమ్మిరెడ్డి సూర్యం(60)కు వివాహం కాలేదు. కూలిపనులు చేసుకుంటూ ఒంటరిగా జీవిస్తోంది. గ్రామానికి సమీపంలో ఉన్న జీడిమామిడి తోటలో పిక్కలు ఏరేందుకు కూలిపనికి వెళ్లింది. ఆమె బుధవారం రాత్రి ఇంటికి రాకపోవడంతో బంధువులు గాలించారు. ఆమె జాడ తెలియలేదు. గురువారం ఉదయం జీడిమామిడి తోటల్లో గాలించగా సూర్యం విగతజీవిగా కనిపించింది. ఆమెపై బుధవారం రాత్రి లైంగికదాడి చేసి, హత్య చేసి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. అందిన ఫిర్యాదు మేరకు నర్సీపట్నం డీఎస్పీ మోహన్, నర్సీపట్నం రూరల్ సీఐ హరి, కృష్ణదేవిపేట ఎస్ఐ ఉపేంద్ర గురువారం మృతదేహాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. సూర్యం మృతదేహాన్ని పోస్టుమార్టానికి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సేవలు

అనకాపల్లి: ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సేవలను ఆన్‌లైన్‌లో అందజేయనున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కె.శాంతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఆపైన విద్యార్హతలు గల యువతీయువకులు ఉద్యోగ అవకాశాలు, తమ విద్యార్హతల నమోదు కోసం జిల్లా ఉపాధి కార్యాలయాన్ని సంప్రదించవలసిన అవసరము లేదని, ఆన్‌లైన్‌లో ఎంప్లాయింట్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. గతంలో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ చేసుకున్న నిరుద్యోగులు గడువుముగిసిన వెంటనే ఆన్‌లైన్‌లో రెన్యువల్ చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు employment.ap.gov.in సంప్రదించాలని ఆమె కోరారు.

పింఛను కోసం పడిగాపులు



నాగులాపల్లి యూనియన్ బ్యాంక్ వద్ద పింఛన్ సొమ్ము కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

మునగపాక: మే నెల పింఛన్లు పొందేందుకు వృద్ధులు, దివ్యాంగులు బ్యాంకుల వద్ద పడిగాపులు పడవలసి వస్తోంది. అర్హులైన లబ్ధిదారుల అకౌంట్‌లో ప్రభుత్వం పింఛన్ నగదు జమ చేయడంతో విత్‌డ్రా చేసుకునేందుకు వెళ్లిన వారు పడరాని పాట్లు పడుతున్నారు. గతంలో తెల్లారక ముందే వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ అందజేసేవారని, ఇప్పుడు చంద్రబాబు పుణ్యమాని పెన్షన్ పొందేందుకు పడరాని పాట్లు పడుతున్నామని పలువురు వృద్ధులు వాపోయారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబుకు తగిన గుణపాఠం చెబుతామంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పరామర్శ

దేవరాపల్లి: స్థానిక సంతతోటలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గొర్లి సన్నిబాబును గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. రెండు రోజుల క్రితం దేవరాపల్లిలో ఇంటింటా ప్రచారానికి వచ్చి ప్రమాదశాత్తు తన ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోయాడు. కాలికి తీవ్ర గాయమైంది. అతడికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా నిచ్చారు. పరామర్శించిన వారిలో కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరదపురెడ్డి లలితానాయుడు, సీనియర్ నాయకుడు గండి పడాల అప్పలరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ, వరదపురెడ్డి చంద్రరావు ఉన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 3,059 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,280	4,600
మొదటి రకం	3,640	4,670
రెండో రకం	3,510	4,200
మూడో రకం	3,260	3,640

అనకాపల్లి సినిమాలు

ప్రసన్న వదనం	: రాజా
శబరి	: సత్యనారాయణస్క్రీన్-1
టెనెంట్	: సత్యనారాయణస్క్రీన్-2
బాక్	: షిర్డిసాయి
ఆ ఒక్కటే అడక్కు	: పర్తిసాయి
రత్నం	: వెంకటేశ్వర
పారిజాత పర్వం	: శ్రీసత్య
డీజే టిల్లు-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-3 యూనిట్లు, బి పాజిటివ్-18 యూనిట్లు, ఒ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 313 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 289 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

చంద్రబాబు మోసపూరిత హామీలు నమ్మొద్దు



మునగపాక మండలంలో టి.సిరసపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి రాజు, హాజరైన ప్రజలు

మునగపాక: చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మరాదని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి మండలంలోని వెంకటాపురం, సిరసపల్లి, తోటాడ,గవర్ల అనకాపల్లి,ఉమ్మలాడ తదితర గ్రామాల్లో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు ప్రజారంజక పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి దీవించాలని కోరారు.చంద్రబాబు అండ్‌కో కుట్రలు,కుతంత్రాలు గమనించాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో ప్రజారంజకంగా ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరేలా పథకాలకు రూపకల్పన చేశారని చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ,ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, యు.వి.రమణమూర్తిరాజులను గెలిపించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు.వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు,సర్పంచ్‌లు మద్దాల ధనలక్ష్మి,సుందరపు తాతాజీ, దొడ్డి మంగవేణి,సూరిశెట్టి గంగయమ్మ, కాండ్రేగుల నూకరాజు,ఎంపీటీసీలు కాండ్రేగుల వెంకటలక్ష్మి, మొల్లేటి కృష్ణవేణి, పార్టీ నేతలు ఇస్మాయిల్,దొడ్డి బాలాజీ, మళ్ల ఈశ్వరరావు, జగదీష్,సూరిశెట్టి శ్రీనివాసరావు,మందా రాము, సూరిశెట్టి రాము, మొల్లేటి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

- యలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబు

సీఎంగా మళ్లీ జగన్‌నే గెలిపించుకోవాలి

అచ్యుతాపురం: అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేసిన వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు అన్నారు. మండలంలోని మోసయ్యపేట, రామన్నపాలెం, చోడపల్లి గ్రామాల్లో గురువారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల,మత,వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేశారని తెలిపారు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా బూడి ముత్యాలనాయుడును,ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఆయన కోరారు. ఈ ప్రచారంలో పలువురు పార్టీ మండల,గ్రామ స్థాయి నేతలు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే రాష్ట్రానికి మేలు



ప్రచారం చేస్తున్న మలసాల భరత్‌కుమార్

- ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్

తుమ్మపాల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేశారని, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించారని అనకాపల్లి నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ తెలిపారు. జగన్ మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రానికి మరింత మేలు జరుగుతుందని చెప్పారు. మండలంలోని కూండ్రం, రొంగలివానిపాలెం, కుంచంగి, వేటజంగాలపాలెం గ్రామాల్లో గురువారం రాత్రి విస్తృతంగా ప్రచారం చేశారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయనకు పెద్ద ఎత్తున ప్రజలు స్వాగతం పలికారు. అనంతరం భరత్ కుమార్ ఇంటింటికీ వెళ్లి ప్రచార కరపత్రాలను అందజేసి, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. తనను గెలిపిస్తే అనకాపల్లి ప్రాంతంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డ్ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద్, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా ప్రచారం

రాంబిల్లి: సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేసే జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యు.వి.రమణమూర్తిరాజు తనయుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ (తేజ) కోరారు. గురువారం రాత్రి ఆయన రజాల, కుమ్మరాపల్లి, కట్టుబోలు తదితర గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి రమణమూర్తిరాజు(కన్నబాబు)ను, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. చంద్రబాబు హామీలను నమ్మవద్దన్నారు. ఎటువంటి అక్రమాలుకు తావులేకుండా ఇంటి వద్దకే పథకాలు అందాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ రావాలని తెలిపారు.

మునగపాక: మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ ఎంపీ,ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, యు.వి.రమణమూర్తిరాజులను గెలిపించాలని కోరుతూ గురువారం వెంకటాపురంలో సర్పంచ్ సుందరపు తాతాజీ,ఉప సర్పంచ్ సాయివజ్రం తదితరులు ప్రచారం చేశారు. కాకరాపల్లిలో ఆ పార్టీ నేత పిట్టా మంగారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ నేతలు సంతోష్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్గినపాలెంలో..

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెంలో వైఎస్సార్‌సీపీ నేతలు బుధవారం రాత్రి గడప గడపకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ప్రతి ఇంటికి వెళ్లి కర పత్రాలను పంపిణీ చేశారు.



కాకరాపల్లిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత మంగారెడ్డి



నర్సింగరావుపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ సతీమణి నివేదిత, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు

జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించాలి

అనకాపల్లి: రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించునే బాధ్యత మన అందరిపై ఉందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ సతీమణి నివేదిత అన్నారు. స్థానిక 82వ వార్డు పరిధిలోని దుర్గాలాడ్జివీధిలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో గురువారం ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా మలసాల భతర్‌కుమార్, ఎంపీగా బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు కుండల రామకృష్ణ, గైపూర్ రాజు, కె.సత్తిబాబు, కోన ఉమా, ప్రభాస్ శ్రీనివాస్, పాలికి కొండబాబు, చింతా అందజి, సాలాపు రమణ, పేరూరు కల్యాణ్, కడిమిశెట్టి సతీష్, డొంక సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురంలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ తాతాజీ,ఉప సర్పంచ్ వజ్రం



నర్సింగరావుపేట రహదారిలో బజ్జీలు వేస్తూ ప్రచారం చేస్తున్న నివేదిత

జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిక



జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: బోగస్ మేనిఫెస్టోతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు టీడీపీ కుయుక్తులు పన్నుతోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. మండలంలో గొలగాం పంచాయతీ పాతతలారివానిపాలెంలో వైఎస్సార్‌సీపీ గ్రామపార్టీ నాయకుడు జోగారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో 10 మంది జనసేన నాయకులు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మలసాల భరత్‌కుమార్ పార్టీకండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రాష్ట్రాల్లోని రాజకీయపార్టీల ఎన్నికల మేనిఫెస్టోను చంద్రబాబు కాపీకొట్టి కూటమి మేనిఫెస్టో రూపొందించారని చెప్పారు. జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి టి.రామ్‌బాబు, జి.హేమంత్, ఎస్.కనకారావు, జె.కనకారావు, ఎం.భాను, పార్వతి, అప్పారావు, చిన్నారావు, రాజులు చేరారు. ఈ కార్యక్రమంలో గొలగాం గ్రామ సర్పంచ్ నరసింహం, ఎంపీపీ గొర్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

- ఎస్పీ మురళీకృష్ణ
- పదవీ విరమణ పొందిన ఏఆర్ ఎస్‌ఐకి ఘన సన్మానం

తుమ్మపాల: పోలీసు సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహించాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. పదవీ విరమణ చేసిన ఏఆర్ ఎస్‌ఐ కె.సూరిబాబు దంపతులను ఎస్పీ కార్యాలయంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూరిబాబు విశేష సేవలందించారని చెప్పారు. కానిస్టేబుల్‌గా పోలీస్‌శాఖలో చేరి, ఎస్‌ఐ స్థాయికి ఎదిగారని తెలిపారు. పోలీసు ఉద్యోగం చాలా ఒత్తిడితో కూడుకున్నదన్నారు. ప్రజలకు నేరుగా సేవలు అందించగలిగే ఈ ఉద్యోగంలో చేరడం చాలా గొప్ప అదృష్టంగా భావించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఏవో బి.శారద, ఇన్‌స్పెక్టర్లు సతీష్, మన్మధరావు, ఆర్ ఎస్‌ఐలు దిల్లేశ్వరరావు, ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



ఏఆర్ ఎస్‌ఐ సూరిబాబు దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ కె.వి.మురళీకృష్ణ

సందట్లో సడేమియా...

- దర్జాగా ఇసుక అక్రమ రవాణా
- పట్టించుకోని అధికారులు



దార్లపూడి సమీపంలో నది నుంచి తీసిన ఇసుక స్టాక్ చేసిన దృశ్యం



పట్టపగలే దర్జాగా ఇసుక తరలిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : దార్లపూడి శివారులో పోలవరం ప్రాజెక్టు కాలువకు ఆనుకుని వరహానదిలో విచ్చలవిడిగా ఇసుక తరలిస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత అధికారులు పర్యవేక్షణ ఉండదనుకుని ఈ రవాణా మరింత స్పీడ్ పెంచారు. కాలువ నిర్మాణాలకు ఆనుకుని నది నుంచి తెచ్చిన ఇసుక నిల్వ చేసి రాత్రుళ్ల గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నారు. ఈ రవాణా ప్రదేశాలు రెవెన్యూ అధికారులకు తెలిసినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు విమర్శలు చేస్తున్నారు. నదిలో ఇసుక తీసి 9 కిలోమీటర్ల దూరం అడ్డురోడ్డుకు దర్జాగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ రవాణాపై స్థానిక తహసీల్దార్ విజయలక్ష్మిని వివరణ కోరగా అనుమతులు లేకుండా నదిలో ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల అందిన సమాచారంతో స్వయంగా వెళ్లి పరిశీలించామని, బాటలకు అడ్డుకట్టలు వేయించాలని ఆదేశించామన్నారు.

10 మంది వలంటీర్ల రాజీనామా



ఎంపీడీవో రాంబాబుకు రాజీనామా పత్రాలు ఇస్తున్న ఏపీపురం పంచాయతీకి చెందిన వలంటీర్లు

నాతవరం : మండలంలో అనంత పద్మనాభపురం నాతవరం పంచాయతీలకు చెందిన పది మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో జాగరపు రాంబాబుకు కార్యాలయంలో అందజేశారు. గతంలో ఆయా పంచాయతీల నుంచి వలంటీర్లు రాజీనామాలు చేయగా మిగిలిన వారు కూడా రాజీనామాలు చేసి విలేకరులతో మాట్లాడారు. మాపై టీడీపీ నాయకులు అనేక ఆరోపణలు చేయడమే కాకుండా మనస్థాపానికి గురి చేసే విధంగా ఇబ్బందులు పెట్టేవారన్నారు. రాజకీయాలకు అతీతంగా తాము ప్రజలకు సేవ చేస్తుంటే ఓర్వలేక కుట్ర చేసేవారన్నారు. రాజీనామా చేశాక మా సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవో రాంబాబు మాట్లాడుతూ ఇంతవరకు వలంటీర్లపై అనేక ఫిర్యాదు చేసే వారని రాజీనామాలు చేశాక, వారు స్వతంత్రంగా వ్యవహరించుకోవచ్చన్నారు.

10,019 మందికి పింఛన్ల పంపిణీ



వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద పింఛన్ అందజేస్తున్న సచివాలయం ఉద్యోగులు



కొత్తవీధిలో దివ్యాంగురాలికి పింఛన్ అందజేస్తున్న సచివాలయం ఉద్యోగి

అనకాపల్లి: జోన్ పరిధిలో 10,019 మందికి మేనెలకు సంబంధించిన సామాజిక పింఛన్లు అందజేసినట్టు జోన్ ఏపీడీ వి.కె.దొర గురువారం చెప్పారు.

వీరిలో 2,419 మందికి ఇళ్ల వద్ద అందజేయగా, 7,600 మంది బ్యాంక్ అకౌంట్లకు నగదు జమ చేసినట్టు చెప్పారు. బ్యాంక్ అకౌంట్లు సరిగాలేని 95 మందికి శుక్రవారం ఫించన్ అందజేయనున్నట్టు ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లి: మండలంలో కొత్తూరు విద్యుత్‌శాఖ సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం 7 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆశాఖ ఈఈ కె.రాజశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

కొత్తూరు, పిసినికాడ, సత్యనారాయణపురం, మూలపేట, వేటజంగాలపాలెం, సంపతిపురం, వెంకుపాలెం, రొంగలివానిపాలెం, కుంచంగి, కూండ్రం, కశింకోట మండలంలో విసన్నపేట, రామన్నపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

కశింకోటలో..

కశింకోట: కన్నూరుపాలెం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. కన్నూరుపాలెంతోపాటు తీడ, చెరకాం, సుందరయ్యపేట, జి. భీమవరం, అచ్చెర్ల, మోసయ్యపేట, మాకవరపాలెం మండలం భీమబోయిన పాలెం, రామన్నపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ మాడుగుల

- 5 ఏళ్లలో రూ.48 కోట్లతో అభివృద్ధి
- వైఎస్సార్‌సీపీ పాలనలో మారిన రూపురేఖలు

మాడుగుల: వైఎస్సార్‌సీపీ పాలనలో మాడుగుల పట్టణం అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. వీధికో నూతన సీసీరోడ్డు, డ్రైనేజీలు, ఇంటింటికీ కుళాయిలు, ఇలా ఒకటేమిటి రూ.48 కోట్లతో ఐదేళ్లలో పలు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక కృషితో రూ.2 కోట్లతో నిర్మించిన సచివాలయ భవనాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ కేంద్రాలు దర్శనమిస్తున్నాయి.

కోటి రూపాయలతో ఉప ఖజానా కార్యాలయం, రూ.2 కోట్లతో ప్రధాన రాజ వీధి, మోదమాంబ కాలనీకి సీసీరోడ్లు ఏర్పాటు చేశారు. రైతు సేవల కోసం రూ.80 లక్షలతో అగ్రి ల్యాబ్, రూ.1.40 కోట్లతో పీఆర్ వసతి గృహ నిర్మాణం, రూ.10 కోట్లతో ఇంటింటికి కుళాయిలు, మూడు జగనన్న కాలనీలు, మోదమాంబ కాలనీలో రూ.35 లక్షలతో కల్యాణ మండపం, రూ.5.50 కోట్లతో 30 పడకల ఆస్పత్రికి నూతన భవన నిర్మాణం, నవర, దొర్లవీధుల్లో రూ.35 లక్షలతో సీసీ కమ్ డ్రైనేజీలు, రూ.43 లక్షలతో గణేష్ కాలనీలో సీసీడ్రైనేజీలు, కనికరమాత కాలనీలో రూ.10 లక్షలతో సీసీ కమ్ డ్రైనేజీలు, జగ్గన్నసావిడిలో రూ.43 లక్షలతో సీసీ డ్రైనేజీలు, రూ.1.3 కోట్లతో కోల్డ్ స్టోరేజీ భవనాలు, హైస్కూల్ కాలనీలో రూ.1.3 కోట్లతో సీసీరోడ్లు, కమ్ డ్రైనేజీలు, జగనన్న కాలనీతోపాటు రామచంద్రాపురానికి రూ.60 లక్షలతో పక్కా రోడ్డు, రూ.23 లక్షలతో అంబేడ్కర్ కాలనీలో సీసీ డ్రైనేజీలు నిర్మించారు. రూ.7.40 కోట్లతో డి.గొటివాడ నుంచి సాగరం మీదుగా తాచేరుపై వంతెనతో పాటు రోడ్డు పనులు పూర్తయ్యాయి.



మాడుగుల పట్టణంలో సచివాలయం, ఆర్బీకేలు



మాడుగులలో నిర్మించిన కోల్డ్ స్టోరేజ్ భవనాలు



మాడుగుల పట్టణంలో సర్వాంగ సుందరంగా అగ్రి ల్యాబ్ భవనం

ఘనంగా బంగారమ్మ తల్లి పండగ

రాంబిల్లి: మండలంలోని లోవపాలెంలో గురువారం బంగారమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. భజనలు, కోలాటాలతో పాటు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.